
సాక్షి
బాపట్ల

ఆదివారం । 11 । మే । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.40 అడుగుల వద్ద ఉంది. ఇది 137.5158 టీఎంసీలకు సమానం.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: పట్టణంలోని సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావన్నారాయణస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

బ్రహ్మంగారి తిరునాళ్ల



రెంటచింతల: పశర్లపాడు గ్రామంలో శనివారం బ్రహ్మంగారి తిరునాళ్ల వేడుకలను వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్సులో చెలరేగిన మంటలు

ప్రయాణికులకు తప్పిన పెనుప్రమాదం

రేపల్లె: ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులో ఆకస్మికంగా మంటలు చెలరేగిన సంఘటన చెరుకుపల్లిలో చోటుచేసుకుంది. రేపల్లె డిపోకు చెందిన ఏపీ 07జడ్ 0492 నంబరు ఆర్టీసీ బస్సు గుంటూరు నుంచి రేపల్లె వస్తున్న సమయంలో శనివారం మధ్యాహ్నం చెరుకుపల్లిలో ఆగింది. ప్రయాణికులు బస్సు ఎక్కి దిగే సమయంలో గేరు బాక్స్ వద్ద ఒక్కసారిగా పొగలు వచ్చి మంటలు ఎగసిపడ్డాయి. భయాందోళనకు గురైన ప్రయాణికులు బస్సు నుంచి దిగి పరుగులు దీశారు. స్పందించిన డ్రైవర్, కండక్టర్‌లతోపాటు స్థానికులు ఇసుకను పోసి మంటలు అదుపు చేశారు. సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో ఆర్టీసీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సైనికుల సహాయనిధికి రూ.5 లక్షల విరాళం

ఎస్పీకి చెక్కు అందజేసిన చీరాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐ



బాపట్లటౌన్: ప్రస్తుతం దేశంలో నెలకొని పరిస్థితుల దృష్ట్యా భారత సైనికుల సహాయనిధికి చీరాల పట్టణానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ రూ.5 లక్షల చెక్కును శనివారం ఎస్పీ తుషార్ డూడీకి అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ భారత సైనికులు దేశ భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారన్నారు. వారిని గౌరవించడమే కాదు, ఇటువంటి విపత్కర సమయాల్లో సాయంగా నిలవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. బాపట్ల జిల్లాకు చెందిన ఎన్‌ఆర్‌ఐ చూపిన ఉదారత అభినందనీయమన్నారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ దేశానికి సేవ చేయాలనే తపన వారి చర్యలో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇలాంటి విరాళాలు అందించేవారు ఇతరులకు ప్రేరణగా నిలుస్తారన్నారు.


శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ తుషార్‌డూడీ



బాపట్లటౌన్: శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. డీజీపీ ఆదేశాల మేరకు దేశంలో నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా బోర్డర్ చెక్ పోస్టులను పరిశీలించాలన్నారు. నిర్మానుష్య ప్రదేశాల్లో నేరాలు అధికంగా జరగటానికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచడం, జిల్లాలతో ఉన్న సరిహద్దు ప్రాంతాలు, జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో నాకాబందీ, వాహనాలు తనిఖీలు నిర్వహించాలని అన్నారు. గంజాయి వినియోగించే వారు, అమ్మే వారి మీద నిఘా, పోలీస్ సిబ్బంది సంక్షేమం వంటి విషయాలపై చర్చించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజలకు సేవలందించుటకు సంసిద్ధంగా ఉండాలన్నారు. మీ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వస్తువులు కానీ, వ్యక్తులు కానీ గమనిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు, 100/112 నంబర్‌కి కానీ ఫోన్ చేసి సమాచారం తెలియపరచాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మల్లేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



పెదకాకాని: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి మల్లికార్జునరావు దంపతులు శనివారం పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయానికి విచ్చేశారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్, అర్చక స్వాములు, వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన వారు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకస్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనం అందించారు. న్యాయమూర్తి దంపతులను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదములను డీసీ అందజేశారు.

తెల్లారిన బతుకులు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీల దుర్మరణం
- తిమ్మరాజుపాలెం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- రోడ్డు క్రాస్ చేస్తూ అదుపుతప్పి బోల్తాపడ్డ గ్రానైట్ లారీ
- డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలు



రోడ్డు ప్రమాదంలో ఛిద్రమైన మృతదేహాలు

పర్చూరు(చినగంజాం): రాత్రి వేళ పనిచేస్తే అధిక కూలి వస్తుందని ఆశించారు...కానీ ఆ రాత్రే వారికి చివరి రాత్రి అవుతుందని అనుకోలేదు...లారీ రూపంలో ఎదురు వచ్చిన మృత్యువు వారి ప్రాణాలను కబళించింది. గ్రానైట్ పలకల లోడుతో వెళుతున్న లారీపై కూర్చున్న ముగ్గురు కూలీలు వాటి కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం జాతీయ రహదారిపై శనివారం వేకువజామున జరిగింది. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్టూరులో గ్రానైట్ పలకల లోడుతో శనివారం వేకువజామున ఓ లారీ గుంటూరు బయలుదేరింది. గుంటూరు వెళ్లెందుకు డ్రైవర్ మస్తాన్‌వలి లారీని పర్చూరు వైపు మళ్లించాడు. తిమ్మరాజుపాలెం వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి సడెన్ బ్రేక్ వేయడంతో లారీ ఒక్కసారిగా బోల్తా కొట్టింది. లారీపై కూర్చొని ఉన్న ముగ్గురు కూలీలు గ్రానైట్ పలకల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారిలో మార్టూరుకు చెందిన పాలపర్తి శ్రీను (25), తాళ్లూరి ప్రభుదాసు (43), పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన తమ్మలూరి సురేంద్ర బాబు(28)గా గుర్తించారు. డ్రైవర్ మస్తాన్‌వలి, క్లీనర్ రమేష్‌లు స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, పర్చూరు ఎస్‌ఐ మాల్యాద్రి హుటాహుటిన తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రానైట్ పలకలను తొలగించి మృతదేహాలను వెలికి తీశారు. రెవెన్యూ అధికారులు సునీత, యార్లగడ్డ శ్రీనివాసరావు, విజయ్ ఆధ్వర్యంలో శవ పంచనామాల అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దృష్టి సారించారు.



సురేంద్రబాబు మృతదేహం

అధిక గ్రానైట్ లోడు ప్రమాదానికి కారణం?

లారీలో అధిక గ్రానైట్ పలకల లోడు వేయడం ప్రమాదానికి కారణమై ఉంటుందని పలువురు భావిస్తున్నారు. సామర్థ్యానికి మించి గ్రానైట్ పలకల లోడు లారీలో ఉన్నట్లుగా సమాచారం. రోడ్డు క్రాస్ చేసే సమయంలో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ బోల్తా కొట్టిందని భావిస్తున్నారు.

పర్చూరు వైపు లారీ ఎందుకు మళ్లింది?

మార్టూరులో గ్రానైట్ పలకలను లోడు చేసుకున్న లారీ నేరుగా గుంటూరు వెళ్లాల్సి ఉండగా పర్చూరు వైపు ఎందుకు మళ్లించారనే దానిపై అనుమానం వ్యక్తమవుతున్నాయి. గ్రానైట్ లోడుకు సంబంధించి సరైన పత్రాలు ఉన్నాయా? లేవా? అనే అనుమానాలను పలువురు వ్యక్త పరుస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి సమాచారం పోలీసుల విచారణ అనంతరం బయటకు వచ్చే అవకాశం ఉంది.

గ్రానైట్ అక్రమ వ్యాపారమే కారణమా?

మార్టూరు: పర్చూరు సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతికి అక్రమ వ్యాపారమే కారణంగా తెలుస్తోంది. మార్టూరు నుంచి వయా చిలకలూరిపేట మీదుగా 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటూరుకు చేరుకోగలిగిన లారీ చిలకలూరిపేట, పర్చూరు మీదుగా 70 కిలోమీటర్లు ప్రయాణించి గుంటూరుకు తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఎందుకు చేరుకోవాల్సి వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. మార్టూరుకు చెందిన టీడీపీ నాయకుడు.. ఓ కేబుల్ వ్యాపారికి సంబంధించిన గ్రానైట్ ఫ్యాక్టరీలో, లారీ యజమాని బిల్లులు లేకుండా గ్రానైట్ శ్లాబులు కొనుగోలు చేశాడని సమాచారం. జాతీయ రహదారిపై తనిఖీలు జరగవచ్చనే కారణంగా మార్టూరు, చిలకలూరిపేట, పర్చూరు మీదుగా గుంటూరు చేర్చాలనుకున్నారు. అంతేకాక వాహన స్థాయిని మించి శ్లాబుల లోడ్ చేశారు. నిరుద్యోగ యువకులను, కూలీనాలీ చేసుకునే కుటుంబాల వారిని ఈ విధంగా అధిక కూలి ఆశ చూపించి అక్రమ వ్యాపారంలో వాడుకోవటం మార్టూరులో పరిపాటిగా మారింది. మార్టూరుకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు శనివారం పర్చూరుకు చేరుకొని మధ్యే మార్గంగా సమస్యను పరిష్కరించినట్లు విశ్వసనీయ సమాచారం.

ముగ్గురూ బంధువులే..

ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురూ బంధువులే. పాలపర్తి శ్రీను, మృతుడు సురేంద్రబాబులు బావమరుదులు. సురేంద్రబాబు భార్య రాణి స్వయనా శ్రీను అక్క. శ్రీను, ప్రభుదాసు సమీప బంధువులే. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురూ ఇలా సమీప బంధువులు కావడం గమనార్హం.



ప్రభుదాసు మృతదేహం

మృతులంతా పేదలే..

ప్రమాదంలో మృతి చెందిన వారంతా మార్టూరు, నూతలపాడు ఎస్సీ కాలనీకి చెందిన పేద కుటుంబాల వారు. రాత్రి వేళ గ్రానైట్ లోడు చేసేందుకు వెళితే అధిక కూలి గిట్టుబాటు అవుతుందని ఆశించి వెళ్లిన వారే. కాగా మార్టూరులో గ్రానైట్ లోడు ఎక్కించడం మరలా గుంటూరు వెళ్లి లోడును దించి రావడం వరకు వారే స్వయంగా ఉంటారు. రోడ్డు ప్రమాదంలో వారు మృతి చెందడంతో ఆయా గ్రామాల కాలనీల్లో తీవ్ర విషాదం నెలకొంది. కూలి కోసం వెళ్లి మృత్యుఒడిలోకి జారుకోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మార్టూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన తాళ్లూరి ప్రభుదాసు ముగ్గురు ఆడపిల్లల తండ్రి. అతడి భార్య మరియమ్మ కాగా, కుటుంబ బాధ్యత అంతా ప్రభుదాసుపైనే ఉంది. కూలి పనిచేసి సంపాదిస్తేనే వారి కుటుంబం గడిచేది. కానీ ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పాలపర్తి శ్రీను అదే కాలనీకి చెందిన వాడు కాగా అవివాహితుడు. అతని తండ్రి పేరయ్యతో కలిసి ఉంటున్నాడు. పర్చూరు మండలం నూతలపాడు ఎస్సీ కాలనీకి చెందిన తమ్మలూరి సురేంద్రబాబు తల్లిదండ్రులు చంద్రం, మేరీలు కాగా భార్య రాణి. ఆమె కూడా కూలి పనులకు వెళ్లి వస్తుంటుంది. వీరికి ఇద్దరు మగపిల్లలు కాగా వీరిద్దరు కూలి పనులకు వెళ్లి తీసుకొచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.



తాళ్లూరి ప్రభుదాసు(ఫైల్)



పాలపర్తి శ్రీను(ఫైల్)



తమ్మలూరి సురేంద్రబాబు(ఫైల్)

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు కృషి

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనలో భాగంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వమే అన్నీ సమకూరుస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి తెలిపారు. బాపట్ల మండలం తూర్పు బాపట్ల కొండబొట్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల పక్కనే ఏర్పాటు చేయనున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మతో కలసి శనివారం భూమి పూజ చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న పరిశ్రమల కోసం ఇండస్ట్రియల్ పార్క్ నిర్మిస్తున్నామన్నారు. పరిశ్రమలకు భూమిని గుర్తించడం, నిర్మాణ పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు జరిగాయన్నారు. మొదటిగా బాపట్లలో 4.5 ఎకరాల భూమిలో పార్క్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం నుంచి రూ.12 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. రెండు నుంచి మూడు అంతస్తులు ఉండేలా 80 గదులు నిర్మిస్తున్నామన్నారు. ఇందులో 30 గోదాములు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎఫ్ఎఫ్‌సీ (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్)లో ఉత్పత్తుల తయారీదారులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. పొదుపు మహిళలు, యువతీ, యువకులు ఎవరైనా ఉత్పత్తులు తయారు చేసుకుంటామని ముందుకు వస్తే వారికి కేటాయిస్తామన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతి, యువకులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చిన్న, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ఎంతగానో సహకరిస్తున్నాయన్నారు. పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా దొరుకుతాయని బాపట్ల పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ సలకల రాజశేఖర్‌బాబు అన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ పి గ్లోరియా, ఏపీఐఐసీ గుంటూరు జోనల్ మేనేజర్ నరసింహారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్



రైతులకు వ్యవసాయ యంత్రాలను అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె: రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. చెరుకుపల్లిలోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం రైతులకు నిర్వహించిన సబ్సిడీ యంత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. రైతులను ప్రోత్సహించే విధంగా సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను అందించి చేయూతనిస్తున్నామన్నారు. అన్నదాతలకు అండగా ఉండేలా త్వరలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రూ.75లక్షల విలువ చేస్తే 112 వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రైతులకు సబ్సిడీపై అందజేశారు. పలువురు రైతులకు కౌలు రైతు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో నేలపు రామలక్ష్మి, వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్‌బాబు, ఏవో బాలాజీ గంగాధర్, తహసీల్దార్ పద్మావతి, డీఎల్‌పీవో శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా హాజరు కానున్న 27,162 మంది విద్యార్థులకు 51 పరీక్ష కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ప్రథమ సంవత్సర పరీక్షలకు 23,279 మంది హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలకు 3,883 మంది హాజరు కానున్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఐవో జీకే జుబేర్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నియమ, నిబంధనలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సర పరీక్షలు రాసిన వారిలో ఎక్కువ శాతం బెటర్‌మెంట్ రాయడంతో ద్వితీయ సంవత్సర విద్యార్థుల కంటే అధికంగా ఉన్నారు.

14 నుంచి మహాకుంభాభిషేక ఉత్సవాలు

శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతీ స్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు



నిర్మాణం పూర్తయిన నూతన రాతి ముఖమండపం, దేవాలయం



కుంభాభిషేకానికి సిద్ధం చేస్తున్న యాగశాల

అద్దంకి రూరల్: పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం నూతన రాతిముఖ మండపంతో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుంది. దేవస్థాన ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు తెలిపారు.

రూ.6.83 కోట్లతో నూతన రాతి ముఖమండపం, ఆలయం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన ముఖ మండపం జీర్ణావస్థకు చేరటంతో 2020లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ దేవస్థాన చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చొరవతో నూతన రాతి ముఖమండపం నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.3 కోట్లు మంజూరు చేశారు. దానికి తోడుగా సీజీఎఫ్ ఫండ్స్ రూ.2 కోట్లు, మిగిలినవి దేవస్థానం, భక్తులు, దాతలు అందించిన సహకారంతో రూ.6.83 కోట్లతో పూర్తి రాతి ముఖమండపంతో ఆలయ నిర్మాణం పూర్తి అయింది.

కార్యక్రమాలు ఇలా..

నూతన రాతిముఖ మండపంతో ఆలయ నిర్మాణం పూర్తి అయిన సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. 14వ తేదీ నుంచి శృంగేరి శారదా పీఠాధిపతి శ్రీశ్రీ విధుశేఖరభారతీ స్వామి బృందంచే విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 19న స్వామిజీ ఆధ్వర్యంలో కుంభాభిషేకం అనంతరం జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయనున్నారు.

13న కలశయాత్ర

ప్రసన్నాంజనేయ స్వామి మహాకుంభాభిషేకంలో భాగంగా ఈనెల 13న ఉదయం 5 గంటలకు అద్దంకి పట్టణంలోని గుండ్లకమ్మ నది నుంచి 1200 మంది మహిళలు కలశాలతో జలాలను సేకరించి గజసహిత మంగళ వాయిద్యాలతో శింగరకొండ దేవస్థానం వరకు కలశయాత్ర నిర్వహించనున్నారు.

50 వేలమందికి పైగా భక్తులు తరలివస్తారని అంచనా

మహాకుంభాభిషేకం, జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠకు శింగరకొండ గ్రామ పరిసర గ్రామాల ప్రజలతోపాటు పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని భక్తులు కూడా భారీ తరలివచ్చే అవకాశం ఉంది. కార్యక్రమానికి సుమారు 50 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని దేవస్థాన అధికారులు భావిస్తున్నారు.

భారీగా ఏర్పాట్లు

కుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా భోజన వసతి, తాగునీరు, సేద తీరేందుకు చలువ పందిళ్లు, వసతి సౌకర్యాలు, మజ్జిగ పంపిణీ భక్తులకు అసౌకర్యం కలుగకుండా భారీగా ఏర్పాట్లు చేపట్టారు.

ఏర్పాట్లు పూర్తి



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మహా కుంభాభిషేకానికి భక్తులు భారీగా తరలిరానున్నారు. 14 నుంచి ప్రారంభమయ్యే కుంభాభిషేకం కార్యక్రమాల్లో భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతిరోజూ భక్తులచే స్వామికి ఏకాహం, భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. ఉత్సవాల్లో పాల్గొని భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కావాలి.

ఎం.తిమ్మనాయుడు, సహాయ కమిషనర్

బైక్ చోరీల ముఠా ఆటకట్టు

- ఐదు జిల్లాల పరిధిలో 50 బైక్‌ల చోరీ
- నలుగురు నిందితుల అరెస్ట్



కంకిపాడులో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు, పోలీస్ అధికారులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కంకిపాడు: మోటారు బైక్‌ల చోరీ ముఠా ఆటకట్టింది. కంకిపాడు పోలీసులు ముఠాను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ మేరకు కంకిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు కేసు వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. గత నెల 25న గంగూరు గ్రామానికి చెందిన మహమ్మద్ జివుల్ రెహమాన్ ఈడుపుగల్లులోని మసీదు వద్ద నమాజ్ చేసుకునేందుకు తన స్నేహితుడి మోటారు బైక్‌పై వచ్చాడు. నమాజ్ చేసుకుని బయటకు వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐ జె.మురళీకృష్ణ, ఎస్‌ఐ డి.సందీప్ కంకిపాడు పట్టణంలోని ఫ్లై ఓవర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా 25 నుంచి 35 ఏళ్ల వయసు గల వ్యక్తులు రెండు మోటారు బైక్‌లపై వెళ్తూ పట్టుబడ్డారు. వారి వాహనాలకు రికార్డులు లేకపోవటంతో గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ద్విచక్ర వాహనాలను చోరీ చేసే ముఠాగా గుర్తించారు.

రూ.21.46 లక్షల విలువైన 50 బైక్‌ల రికవరీ

కృష్ణాజిల్లాలోని కంకిపాడు, పెనమలూరు, పెడన, మచిలీపట్నం, గుడ్లవల్లేరు, ఎన్టీఆర్ జిల్లాలోని భవానీపురం, మాచవరం, విజయవాడ టూ టౌన్, గుంటూరు జిల్లా కొత్తపేట, మంగళగిరి టౌన్, ఏలూరు జిల్లాలోని ఏలూరు టూ టౌన్, బాపట్ల జిల్లాలోని రేపల్లె పోలీసుస్టేషన్లలో మొత్తం ఐదు జిల్లాల పరిధిలో 17 పోలీసుస్టేషన్లలో రూ.21.46 లక్షల విలువైన 50 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు విచారణలో నేరం అంగీకరించారు. మచిలీపట్నం నిజాంపేటకు చెందిన మొహమ్మద్ రిజ్వాన్, కోడూరు మండలం గొడపాలెంకు చెందిన కేశన సురేష్, ఉల్లిపాలెం గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం, కోలా కృష్ణారావులను మోటారు బైక్‌ల చోరీ కేసులో నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. ముందుగానే చోరీ చేసేందుకు ఒక ప్రాంతాన్ని ఎంచుకుని సీసీ కెమెరాల్లో చిక్కకుండా ఉండేలా హెల్మెట్ ధరించి చోరీలకు పాల్పడటం ఈ ముఠా నైజమన్నారు. ఫంక్షన్ హాల్స్, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, హాస్పిటల్స్ వద్ద పార్కు చేసి ఉన్న వాహనాలే వీరి లక్ష్యంగా పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. కేసు విచారణలో ప్రత్యేక చర్యలు తీసుకున్న సీఐ జె.మురళీకృష్ణ, ఎస్‌ఐ డి.సందీప్, హెచ్‌సీ కె.చంద్రబాబు, పీసీలు పీఎస్ఎన్ మూర్తి, ఎస్‌డి బాబీబాబులను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

క్లుప్తంగా

శాంతి భద్రతల పరిరక్షణకే పల్లెనిద్ర

రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు



రేపల్లె: శాంతి, భద్రతల పరిరక్షణతోపాటు ప్రజలతో మమేకమై పనిచేసేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు చెప్పారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వార్డులో ఎటువంటి సమస్యలు తలెత్తినా శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. వివాదస్పద సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వార్డులో అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కొత్త వ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు తెలపాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటే తప్పనిసరిగా పోలీసులకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పోక్సో కేసుల వివరాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి యాక్ట్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగిన వ్యక్తి మృతి

మార్టూరు: మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి చేరుకున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మార్టూరులో శనివారం జరిగింది. స్థానిక నాగరాజు పల్లి రోడ్డులో గల వైన్స్ షాపు వద్ద మార్టూరు రాంనగర్ కాలనీకి చెందిన మోదపాటి దానియేలు (35) మధ్యాహ్నం వెళ్లి మద్యం సేవించి షాపు సమీపంలో బండపై పడుకున్నాడు. మద్యం మత్తులో దాహంతో గొంతు ఎండిపోయిన దానియేలు ఉలుకూ, పలుకు లేకుండా అపస్మారక స్థితిలో ఉండిపోయాడు. మొదట గుర్తు తెలియని వ్యక్తిగా భావించిన స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాసుత్రికి తరలించారు. దానియేలును పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది అతని బంధువులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

భక్తుల కల సాకారం.. దివ్య రథానికి స్వాగతం

- పునుగు రామలింగేశ్వరస్వామికి నూతన రథం
- 54 సంవత్సరాల తరువాత.. స్వామివారి రథోత్సవం
- రేపటి కార్యక్రమాలకు భారీ ఏర్పాట్లు

చీరాల అర్బన్: భక్తుల సహకారం, దాతల దాతృత్వం వెరసి పునుగు రామలింగ మల్లేశ్వరస్వామికి దివ్య రథం సాకారమైంది. ఎన్నో ఏళ్లుగా లోటుగా ఉన్న పెద్ద రథం 54 సంవత్సరాల తర్వాత రూపుదిద్దుకొని తిరిగి భక్తులకు సాక్షాత్కరించనుంది. అందుకు ఈనెల 12న సుముహూర్తం ఖరారైంది. పట్టణంలోని పేరాల్లో వేంచేసియున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత పునుగు రామలింగమల్లేశ్వరస్వామి దేవాలయం 17వ శతాబ్దంలో నిర్మించారు. దేవాలయంలో కారంచేటి వంశీయులచే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆనాటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కళ్యాణం అనంతరం పెద్ద రథంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చేవారు. పేరాల్లోని శివాలయం వద్ద నుంచి కారంచేడు గేటు వరకు స్వామి వారు రథంపై ఊరేగుతూ భక్తుల శివనామస్మరణలతో రథోత్సవం సాగేది. పెద్ద రథం అందరినీ ఆకట్టుకోవడంతో ఈ సెంటర్‌కు పెద్ద రథం సెంటర్‌గా పిలిచేవారు. దీన్ని ఉంచేందుకు షెడ్డు లేక.. 1971లో రథం శిథిలావస్థకు చేరడంతో రథోత్సవాన్ని నిలిపివేశారు.

భక్తుల దృఢ నిర్ణయంతో రథం

స్వామివారికి ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో ట్రాక్టర్‌పై ఊరేగింపులు నిర్వహించేవారు. స్వామివారికి నూతన రథం ఏర్పాటు చేసేందుకు భక్తులు దృఢ



నూతన పెద్ద రథం

నిర్ణయం తీసుకున్నారు. రథం లేని లోటు తీర్చేందుకు ముఖ్యంగా అన్నదాత పాండురంగారావు గట్టిగా సంకల్పించారు. రాజేంద్రప్రసాద్, హరిబాబు ఇతర పెద్దల సహకారంతో 2023 మే నెలలో రథం పునఃనిర్మాణానికి పూనుకున్నారు. రథాలను తయారు చేయడంలో నిపుణులైన వలపర్లకు చెందిన జి.స్వాములకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ఆయన కుమారుడు మధుసూదనరావు నిర్విరామ దీక్షతో పనులు చేశారు. రథం నిర్మాణంలో ఉపయోగించే కలపను పాల్వంచ ప్రాంతం నుంచి తీసుకువచ్చారు. దేవతామూర్తులను పాతచీరాలకు చెందిన అర్జునరెడ్డి యంత్రాలతో కాకుండా సొంతంగా దీక్షతో తయారు చేశారు. రథానికి అవసరమైన ద్వారపాలకులు, బ్రహ్మ, వినాయకుడు ఇతర దేవతామూర్తులను అందంగా తీర్చిదిద్దారు.

భారీగా తీర్చిదిద్దిన నిపుణులు

రెండు సంవత్సరాల నిర్విరామ కృషితో రూపుదిద్దుకున్న నూతన రథంలో సోమవారం జరిగే రథోత్సవంలో దేవతామూర్తులు కొలువై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 450 అడుగుల ఎత్తు, 14.5 అడుగుల వెడల్పు, ఆరు చక్రాలతో భారీ రథాన్ని రెండు సంవత్సరాల పాటు తయారు చేశారు. గతంలో దేవాలయం వద్ద రథాన్ని నిలిచేందుకు షెడ్డు లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ఈసారి ఆ ఇబ్బందులు తలెత్తకుండా దేవాలయం పక్కన భారీ షెడ్డును దాతల సహకారంతో నిర్మించారు. ప్రస్తుతం స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి కల్యాణోత్సవం అనంతరం సోమవారం సాయంత్రం నూతన రథానికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కమిటీ సభ్యులు, దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవాదాయ శాఖ మంత్రితో పాటు ప్రముఖులను కార్యక్రమానికి ఆహ్వానించారు. మూడు రోజులుగా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 54 ఏళ్ల తర్వాత అందంగా రూపుదిద్దుకున్న నూతన పెద్ద రథంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. పెద్ద రథంపై స్వామివార్లను ఎప్పుడెప్పుడు తిలకిస్తామా అంటూ భక్తితో ఎదురు చూస్తున్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

ఇంకొల్లు(చినగంజాం): గాదె వీరారెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో ఇంకొల్లు మండలం పావులూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు సీజన్1లో శనివారం రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి మ్యాచ్‌లో ఉప్పుగుండూరు క్రిష్టియన్ యూత్ జట్టు, ఉప్పుగుండూరు అంబేడ్కర్ యూత్ జట్ల మధ్య నిర్వహించారు. టాస్ గెలిచిన క్రిష్టియన్ యూత్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ చేసిన అంబేడ్కర్ యూత్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్ చేసిన క్రిష్టియన్ యూత్ 7 ఓవర్లలో 68 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన బొబ్బేపల్లి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్ చేసిన దుద్దుకూరు ఫ్రెండ్స్ జట్టు 10 ఓవర్లలో 62 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయింది.



సీజీహెచ్‌ఎస్‌కు రేపు సెలవు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించే సీజీహెచ్ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) వెల్‌నెస్ సెంటర్‌కు సోమవారం బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందని గుంటూరు సీజీహెచ్ఎస్ ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి తుకారాం శనివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని కార్డు హోల్డర్లంతా వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం గుంటూరుకు రావద్దని ఆయన సూచించారు.

రేపు జిల్లా రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు

అచ్చంపేట(క్రోసూరు): పల్నాడు జిల్లా స్థాయి రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు సోమవారం అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరుగుతాయని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం శనివారం తెలిపారు. రెజ్లింగ్ ఎంపికల గురించి వివరిస్తూ అండర్-17 విభాగంలో బాలుర, బాలికల ఎంపికలు జరుగుతాయని వారు 2008, 2009, 2010 సంవత్సరాలలో పుట్టిన వారై ఉండాలన్నారు. 2010లో పుట్టినవారు మెడికల్ సర్టిఫికెట్, పేరంటల్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. అండర్-23 విభాగంలో పురుషులు, స్త్రీల ఎంపిక జరుగుతుందన్నారు. వీరు 2002 నుంచి 2006 సంవత్సరాలలో పుట్టి ఉండాలన్నారు. 2006లో పుట్టినవారు మెడికల్ సర్టిఫికెట్, పేరంటల్స్ సర్టిఫికెట్ అందజేయాలన్నారు. ఎంపికల్లో పాల్గొనదలచినవారు ఈనెల 12 ఉదయం 10 గంటలకు గురుకుల కళాశాలలో ఆధార్ జిరాక్స్ కాపీ, ఒరిజనల్ కార్డు, మెడికల్, పేరంటల్ సర్టిఫికెట్లు తీసుకోని రావాలన్నారు. ఎంపికైన వారు ఈనెల 16,17,18 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

పిడుగుపాటుకు 11 జీవాలు మృతి



బొల్లాపల్లి:పిడుగుపాటుకు గుర్రై గొర్రెలు, మేకలు మృతిచెందిన సంఘటన మండలంలోని గుమ్మనంపాడు గ్రామ పొలాల్లో శనివారం జరిగింది. గ్రామానికి ఆళ్లగండి చెరువు వీరనాయకులు గుడి వద్ద ఈదురుగాలులతో కూడిన వర్షంలో పిడుగు పడటంతో గొర్రెలు, మేకలు 11 మృత్యువాతకు గురయ్యాయి. గ్రామానికి చెందిన గోపినాయక్,కె.నాగయ్యలతోపాటు మరి కొందరు రైతులకు చెందిన 11 జీవాలు మృతిచెందాయి. వీటివిలువ సుమారు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉంటుందని బాధితులు చెప్పారు. ఘటనా ప్రాంతాన్ని గుమ్మనంపాడు పశు వైద్యుడు బి.సాల్మన్‌సింగ్ పరిశీలించి ఆయా జీవాల యజమానుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రేపటి నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరుఎడ్యుకేషన్: స్టూడెంట్ యూనియన్ ఆఫ్ నేషన్, కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9, 10వ తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థులకు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు బ్రాడీపేట 2/6లోని యూటీఎఫ్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హిందూ ధర్మాన్ని విస్తరింపజేసేందుకే ధార్మిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మప్రచారక్ హేమశంకరరావు

రేపల్లె: హిందూ ధర్మాన్ని గ్రామగ్రామ విస్తరింపజేసేందుకు సమరసత సేవా ఫౌండేషన్, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు చెప్పారు. మండలంలోని పోటుమెరక ఎస్టీ కాలనీలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి సత్సంగం నిర్వహించారు. హేమశంకరరావు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో జిల్లాలోని పలు ఎస్టీ కాలనీలలో ఆలయాల నిర్మాణాలను చేపట్టామన్నారు. ప్రతి నెలా గ్రామ గ్రామన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు హైందవ ధర్మ విశిష్టతను తెలియజేస్తున్నామన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నిజాంపట్నం మండలం గరువుపాలెం నుంచి నగరంలోని ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఈ నెల 22వ తేదీన జరగనున్న హనుమాన్ శోభయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రేపల్లె చెంచయ్య, గరికపాటి కామయ్య, సుందరరామిరెడ్డి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

రేపల్లె: కార్మికులను బానిసలుగా చేసే కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని ఆదర్శ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్మిక సంఘాల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా వ్యతిరేకించాలన్నారు. సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్‌తో నిర్వహించతలపెట్టిన సమ్మెలో కార్మిక సంఘాలు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలు కార్మిక సంఘాల నాయకులు సింగం వాణి, ఝాన్సీ, శివ నాగులు, వాణి, ఎం.శోభారాణి, బి.శామ్యూల్, ఈశ్వరరావు, గొట్టుముక్కల బాలాజీ, కేవీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేల పేరిట ఉద్యోగినులపై ఒత్తిడి తగదు

- కోటేశ్వరమ్మ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు, ఏఎన్ఎంలు

రేపల్లె: పట్టణంలో ఏఎన్ఎంగా పనిచేస్తూ బలవన్మరణానికి పాల్పడిన కోటేశ్వరమ్మ మృతిపై సమగ్ర విచారణ చేసి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో మహిళా ఉద్యోగులపై పని ఒత్తిడి, వేధింపులు అధికం అవుతున్నాయని పేర్కొన్నారు. ఇంటింటి సర్వే, ఫోన్ సర్వే, యాప్ సర్వేల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఈ విషయంలో సాంకేతికపరంగా ఎదురవుతున్న సమస్యలపై సతమతమవుతున్నారని పేర్కొన్నారు. సర్వేల సమయంలో ఫోన్‌లు సక్రమంగా పనిచేయక, సకాలంలో పనులు పూర్తవ్వటం లేదని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. సమీక్షల పేరుతో జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగటంతో మహిళా ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలకు చావు పరిష్కారం కాదని, పోరాటాల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పారు. మహిళా ఉద్యోగులపై సర్వేల పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. కోటేశ్వరమ్మ మృతిపై అనుమానాలు ఉన్నట్లు బంధువులు పేర్కొంటున్నారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల నుంచి తాలూకా సెంటరు వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఉద్యోగులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు బీజేపీ తూట్లు



సంఘం శరణం గచ్ఛామి నాటకంలోని ఓ సన్నివేశం

- ఆకట్టుకున్న 'బుద్ధం శరణం గచ్ఛామి' నాటకం
- అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా ప్రదర్శన

చీరాల రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కొందరివాడు కాదని అందరివాడని ఆయన ఆశయాలను కొనసాగించిననాడే ఆయనకు నిజమైన నివాళులని చినగంజాం తహసీల్దార్ జివ్విగుంట ప్రభాకరరావు అన్నారు. శనివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ 'బుద్ధం శరణం గచ్ఛామి' నాటకం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కేవీపీఎస్ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రపంచ దేశాలు అనుకరిస్తుంటే ఇక్కడ బీజేపీ ప్రభుత్వం మాత్రం వ్యతిరేకిస్తోందని.. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తోందన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగాన్ని కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పించటానికి అంబేడ్కర్ నాటక ప్రదర్శన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 22న కర్నూలులో ప్రారంభమై.. 755 నాటక ప్రదర్శనగా చీరాల చేరినట్లు చెప్పారు. సమాజమే తన కుటుంబంగా భావించి కన్నబిడ్డల చావులను కూడా లెక్కచేయకుండా మనువాదంపై పోరాటం నిర్వహించి భారత రాజ్యాంగ రూపకర్తగా చరిత్రలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలిచిపోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ జీవిత చిత్రం సంఘం శరణం గచ్ఛామి ప్రదర్శన ద్వారా డాక్టర్ అంబేడ్కర్ జీవితంలో ముఖ్య ఘట్టాలు, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ కళాకారులు ప్రదర్శించిన సంఘం శరణం గచ్ఛామి నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. అంబేడ్కర్ విద్యార్థి జీవితం నుంచి ఆయన పడిన కష్టాలు, ఆయన ఎదుర్కొన్న సామాజిక వివక్ష, ఉన్నత విద్యకోసం ఆయన పడిన తపన, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన తెగువ, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన కీలకమైన కృషిని కళాకారులు తమ ప్రదర్శనలో భావోద్వేగంగా చూపించారు. సమానత్వం కోసం ఆయన చేసిన ఉద్యమాలు ప్రేక్షకులను కదిలించాయి. అంబేడ్కర్ బాటలో నడవాల్సిన ఆవశ్యకతను కళాకారుల బృందం కళ్లకు కట్టినట్లు చూపించారు. నేటి సమాజం అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ జిల్లా లింగం జయరాజు, కె.శరత్, ఎస్.బాబురావు, పి.కొండయ్య, సీహెచ్.సురేష్, ఎన్.సురేష్, ప్రజాసంఘాల నాయకులు మోహన్‌కుమార్ ధర్మ, వి.వెంకటేశ్వర్లు, ఆర్.రవికుమార్, నూకతోటి బాబురావు, చిన కొండయ్య పాల్గొన్నారు.

16 కిలోల గంజాయి పట్టివేత

లక్ష్మీపురం: రైళ్ల ద్వారా వేరే రాష్ట్రాలకు గంజాయిని తరలించి అధిక లాభాలకు విక్రయిస్తున్న నిందితుడిని రైల్వే జీఆర్పీ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. అతడి నుంచి 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిసాకు చెందిన అజిత్‌కుమార్ జైన్, భోగా నాయక్‌లు అక్కడ గంజాయిని కొనుగోలు చేసి అధిక లాభాలకు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో విక్రయించేందుకు రైలులో బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న రైల్వే డీఎస్పీ పి.అక్కేశ్వరరావు, జీఆర్పీ సీఐ అంజిబాబు, ఐపీఎఫ్ సీఐ శంకరరావు, ఎస్ఐలు లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్పీఎఫ్ సిబ్బంది ఎం.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఎం.సోమశేఖర్, జి.వాసులు కలిసి గుంటూరు రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై నిఘా పెట్టారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అజిత్‌కుమార్ జైన్‌ను జీఆర్పీ సీఐ అంజిబాబు సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 16 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అజిత్‌కుమార్ జైన్‌తో పాటు భోగానాయక్ అనే వ్యక్తి ఉన్నాడని, అతడు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అజిత్‌కుమార్ జైన్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.